క్లుప్తంగా

‘కంటి వెలుగు’ ప్రారంభం

పినపాక: కిష్టాపురం పంచాయతీలో కంటి వెలుగు కేంద్రాన్ని ఎంపీపీ గుమ్మడి గాంధీ గురువారం ప్రారంభించారు. ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందని, గ్రామంలో కంటి వెలుగు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి మధ్యాహ్న భోజనం

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని రైతువేదికలో కంటి వైద్యశిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యాధికారులు, సిబ్బందికి గురువారం మధ్యాహ్న భోజనాన్ని మిలీనియం కొత్తగూడెం లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అందించారు. వైద్యాధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలకుగాను ఈ కార్యక్రమం చేపట్టినట్లు క్లబ్ బాధ్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, క్లబ్‌బాధ్యులు గుప్తుల శ్రీనివాసరావు, మూడు బాలునాయక్, బాబురావు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై సమావేశం

బూర్గంపాడు: మోతెగడ్డ వీరభద్రస్వామి శివరాత్రి జాతర ఏర్పాట్లను అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పూర్తిచేయాలని తహసీల్దార్ భగవాన్‌రెడ్డి సూచించారు. గురువారం బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో మోతెగడ్డ జాతరపై ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు జాతరకు సంబంధించిన పారిశుద్ధ్య చర్యలను చేపట్టాలని, దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించాలని అన్నారు. పోలీస్, వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలను చేపట్టాలన్నారు. దేవాదాయ శాఖ అధికారులు సుదర్శన్, బెల్‌సింగ్, ఎస్సై సంతోష్, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, సర్పంచ్ సూరమ్మ పాల్గొన్నారు.

చట్ట సవరణ వద్దు..

చండ్రుగొండ: కేంద్రప్రభుత్వం అటవీహక్కుల చట్టం సవరణ విరమించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్‌కె.ఉమర్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉమర్ మాట్లాడుతూ.. అటవీహక్కుల చట్టాన్ని సవరించాలని కేంద్రం యోచిస్తోందని, దీనివల్ల ఆదివాసీలు తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. పోడుదారులపై కేసులు ఎత్తివేయాలని, పేదలందరికి డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయ ఇన్‌చార్జికి అందించారు. ఆ పార్టీ నాయకులు వరికూటి వెంకట్రావ్, తోలెం వెంకటేశ్వర్లు, టి.భీముడు, బాలు, లాలు పాల్గొన్నారు.

రేపు ‘ఘంటసాల స్వరమాధురి’

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని పెన్షనర్స్ భవనం వద్ద భద్రాద్రి స్వర సంగమం వారి ఆధ్వర్యంలో ఘంటసాల సంగీత విభావరి కార్యక్రమం శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1.00గంట వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. స్థానిక గాయకులు ఘంటసాల పాటలతో భద్రాద్రి వాసులను ఆనందింపజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీచలం, డాక్టర్ గోళ్ల భూపతిరావు, చందు, భీమవరపు వెంకటరెడ్డి, భూషణ్ రావు, తాతోలు దుర్గా చారి, తులసీదాస్, డాక్టర్ విజయ్ రావు, నాగరాజు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పూలమార్కెట్ సెంటర్ ఆటో యూనియన్, రాయిగూడెంకు చెందిన యువతకు పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆదేశాల మేరకు రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం వాలీబాల్ కిట్లను బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, వేముల లక్ష్మయ్య, బోశెట్టి రవిప్రసాద్, గుర్రం సృజన్, సంపత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారాయణపురం గ్రామ శివారులోగల శ్రీ కట్టమైసమ్మ తల్లి ఆలయంలో జాతర ఉత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల సమక్షంలో ఉదయం నిత్య పూజ, అష్టోత్తర కలశ ఆరాధన, నీరాజన మంత్ర పుష్పాలు చేశారు. సాయంత్రం వేళలో కొలువులు నిర్వహించి, విశేష పూజలు నిర్వహించారు. అలాగే ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద నిర్వహించిన కూచిపూడి, జానపద నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అదే విధంగా అమ్మవారిని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దయతో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. నారాయణపురం సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు, చందా సతీష్, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

‘మిర్చి’పై వైరస్ కాటు

- పూత, కాత దశల్లో ఆశిస్తున్న తెగులు
- నీరు కట్టేందుకు అందని కరెంట్
- భారీగా పెట్టుబడులు ఆవిరి
- దయనీయంగా కౌలు రైతుల దుస్థితి


మిర్చి పూతకు పట్టిన నల్లి తెగులు


తెగులు కారణంగా ఎండిపోయిన మిరప తోట

దుమ్ముగూడెం: గోదావరి వరదలతో తీవ్రంగా నష్టపోయిన మండల రైతన్నలు పంటలను ఆలస్యంగా వేసి సరైన దిగుబడి రాక అప్పులపాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పాటు మిర్చి పంటలకు తెగుళ్ల వైరస్‌ల బెడద మరోవైపు రైతులను అతలాకుతలం చేస్తోంది. అనుకున్న స్థాయిలో పంట లాభాలు రావడం దేవుడెరుగు.. తెగుళ్లను తట్టుకుని పెట్టిన పెట్టుబడి వెనుకొస్తే చాలు అనే పరిస్థితిలు నెలకొన్నాయి. కొన్ని చోట్ల నష్టపోయి ఒక్క పైసా రాక పంటలను తొలగిస్తున్నారు. అప్పులు తెచ్చి ఎరువులు క్రిమిసంహారక మందులు పిచికారి చేసినా లాభం వచ్చే పరిస్థితి లేదని గ్రహించిన మనోవేదనకు గురవుతున్నారు.

నల్లి తెగులు ప్రభావం..

మండల వ్యాప్తంగా మిరప, పత్తి, వరి పంటలను ఎక్కువ స్థాయిలో సాగు చేస్తూ ఉంటారు. ఈ సారి పత్తి పంట దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండిన పత్తికి గిట్టుబాటు ధర అందక పంటల సాగు కోసం చేసిన అప్పులను ఎలా తీర్చాలో తెలియని అయోమయం స్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ సాగులో కొంచెం రైతన్నకు ఆర్థిక లాభం అందజేసే మిర్చి పంటలపై ఆశలు పెట్టుకున్నారు. కానీ ఇక్కడా నిరాశే మిగులుతోంది. పత్తి పంట కంటే మిర్చి పంటకు పెట్టుబడి ఎక్కువ అయినా రైతులు సాహసం చేసి సాగు చేశారు. కానీ నల్లి తెగులు పంటలను ఆశించి వారి ఆశలను ఆవిరి చేసింది. ఈ ఏడాది మండల వ్యాప్తంగా సుమారు 1200 ఎకరాలలో మిర్చి పంటను రైతులు సాగుచేశారు. ఇందులో అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 200 నుండి 300 ఎకరాల వరకు మిర్చి పంటకు తెగులు వచ్చింది. భూమి కౌలుకు తీసుకొని అప్పులు తెచ్చి పెట్టుబడి పెడితే, పూత, కాత దశలో తెగుళ్ల సోకుతున్నాయి. మరోవైపు తెగుల్లు పట్టిన పంటకు తడి పెడదామంటే అప్రకటిత విద్యుత్ కోతలతో సమయానికి కరెంట్ లేక పంటలు ఎండిపోతున్నాయి.

తెగుళ్లతో నష్టపోతున్నాం..



2 ఎకరాల మిర్చి పంటను సాగుచేస్తున్నాను. దీనికోసం సుమారు 6లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. మిర్చి పంటకు తెగులు రావడం వల్ల 2 ఎకరాల పంటలో అర ఎకరం పంట పూర్తిగా పాడైపోయింది. మిగిలిన పంటకు కూడా తెగులు ఉంది. దానిని కాపాడుకునేందుకు అన్ని రకాల మందులను పిచికారీ చేసి కాపాడుకుంటున్నాను.

– యానబోయిన వెంకట్రావు, రైతు, సున్నంబట్టి

రూ.లక్షల్లో పెట్టుబడులు..



ఎకరంన్నర మిర్చి పంటకు లక్షల్లో పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్నాం. పంటకు నల్లి తెగులు సోకడంతో పంట ఎదగక కాత రాలి పోయే పరిస్థితి వచ్చింది. పంటను కాపాడుకునేందుకు అన్ని రకాల మందులను వాడుతున్నప్పటికీ ఉపయోగం లేకుండా పోతోంది. సంబంధిత అధికారులు తెగులు పట్టిన పంటల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

– రాయపూడి యేసురత్నం, రైతు, రేగుబల్లి

వాతావరణ మార్పులతో నల్లి తెగులు



వాతవరణ మార్పుల వల్ల మిర్చి పంటకు నల్లి తెగులు వ్యాపిస్తోంది. ఈ తెగులు నివారణకు సంబంధిత శాస్త్రవేత్తలు ఆయా మందులను సూచిస్తున్నారు. రైతులు వాటినే పిచికారీ చేసుకోవాలి. ఈ రకమైన నివారణ చర్యలు ఫలితాన్నిస్తాయి.

– మరియన్న, జిల్లా వ్యవసాయ అధికారి

నిధుల విడుదలపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి

పినపాక: సీఎం కేసీఆర్ ఖమ్మం బహిరంగ సభలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి పంచాయతీకీ 10 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై బీఆర్ఎస్ పార్టీ పినపాక నాయకులు, సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం మండల పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. నియోజకవర్గానికి భారీగా నిధులు తీసుకురావడంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు కృషి మరవలేనిది అని అన్నారు. పినపాక మండలానికి ఫైర్ స్టేషన్ మంజూరు చేయడమే కాక సిబ్బందిని నియమించడం సంతోషమన్నారు. స్థల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామన్నారు. నియోజకవర్గానికి సంబంధించి పాలిటెక్నిక్ కాలేజ్ మంజూరు చేయడమే కాక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయటం సంతోషకరమని తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ నాయకులు, సర్పంచ్‌లు తరపున కేసీఆర్, రేగా కాంతారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఆత్మ చైర్మన్ భద్రయ్య, సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ, మండల ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నసమారాధన

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారంవారిగూడెం కాలనీ గ్రామంలోని శ్రీ ఆదిపరాశక్తి విజయ భవాని అమ్మవారి ఆలయంలో జాతర ఉత్సవాల సందర్భంగా గురువారం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అభిషేకాలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారం రాధ, ఉప సర్పంచ్ గేదల సురేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు యూఎస్ ప్రకాశ్‌రావు, తాడేపల్లి రవి, నార్లపాటి రాములు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో..

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ఇంజపురి రమాదేవి–కోటేశ్వరరావు దంపతుల కుమారుడు రాజేష్ స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వారు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాతలను ఆలయ కమిటీ వారు శాలువాతో సన్మానించి సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతుల దహనం


ములకలపల్లి: బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

దమ్మపేట: సీపీఎం అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. గురువారం మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో, కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్ రైతులకు వ్యతిరేకంగా, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం బడ్జెట్ పత్రులను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, కోలిక పోగు శ్రీనివాసరావు, స్రవంతి, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయరంగాన్ని చిన్నచూపు చూశారని, రైతులకు నిధులుపెంచి ఆదుకోవాలని తెలంగాణా రైతు సంఘం మండల (ఏఐకేఎస్) అధ్యక్షుడు ఊకంట రవికుమార్ అన్నారు. సంఘ రాష్ట్రకమిటీ పిలుపులో భాగంగా ములకలపల్లిలో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బడ్జెట్ జిరాక్స్ ప్రతులను దహనం చేశారు. నూతన బడ్జెట్‌లో అన్నదాతకు ఒరిగిందేమీలేదని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గోపగాని లక్ష్మీనర్సయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, బైరు ప్రసాద్, ముదిగొండ శ్రీను, కొయ్యల ముత్తయ్య, శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందని సీపీఎం అనుబంధ రైతుకూలీసంఘం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య విమర్శించారు. చండ్రుగొండలో గురువారం ఆయన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం కేంద్రబడ్జెట్ స్పందించారు. బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సీసీఐను మూసివేయాలనే కేంద్రప్రభుత్వ ఆలోచన దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. క్వింటాకు రూ.12వేల మద్దతు ధర ఇవ్వాలని, కేంద్రం సీసీఐలు ఏర్పాటు చేసి పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చీడపీడలతో పంట నష్టపోయిన మిర్చి రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. త్రీఫేస్ విద్యుత్ అంతరాయం లేకుండా పగటివేళ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆ పార్టీ నాయకులు జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కొండపల్లి శ్రీధర్, ఐలూరి రామిరెడ్డి, సర్పంచ్ కాక సీత, పెద్దిని వేణు, విప్పర్ల వెంకటేశ్వర్లు, అబ్దుల్ రహెమాన్, ఎస్కే నాగుల్‌మీరా, దాసరి సీతారాములు పాల్గొన్నారు.

13న కంటి వైద్యశిబిరం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఈనెల 13న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బంధు వెంకటేశ్వరరావు, కేఎస్ఎల్‌వీ.ప్రసాద్ తెలిపారు. వరంగల్‌లోని శరత్ మ్యాక్సీవిజన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యాన ఏర్పాటు చేసే ఈ శిబిరానికి ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు రావొచ్చని, పరీక్షల అనంతరం శస్త్ర చికిత్స అవసరమైన వారిని వరంగల్ తీసుకెళ్లి ఉచితంగా చికిత్స చేస్తారని పేర్కొన్నారు. ఈమేరకు శిబిరానికి వచ్చేటప్పుడు హెల్త్‌కార్డ్‌తో హాజరుకావాలని సూచించారు.

డీఎస్పీకి ఘన సన్మానం

మణుగూరురూరల్: మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావును దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు మద్దెల అన్నపూర్ణ గురువారం వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె డీఎస్పీ రాఘవేంద్రరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. మహిళల సంరక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్న దిశా ఫౌండేషన్‌కు పోలీసుల సహాయ సహకారాలు ఎల్లవేళల ఉండాలని, మహిళా రక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. కార్యక్రమంలో దిశా ఫౌండేషన్ సభ్యులు సువర్ణ, స్వరూప, సుజాత, స్వర్ణ, హేమలత, శిరీష, గౌతమి, తరంగిణి పాల్గొన్నారు.

అభినందనీయం..

అశ్వాపురం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేద విద్యార్థులకు ‘నేను సైతం సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్’వ్యవస్థాపకుడు, కళాశాల అధ్యాపకుడు తారా ప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అశ్వాపురం ఎస్సై నాగుల్‌మీరా అన్నారు. కళాశాలలో 40వ రోజు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని గురువారం ఎస్సై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. తారా ప్రసాద్‌ను అభినందించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాత్రపై ప్రచారం

ములకలపల్లి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యమని, అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన సాగనుందని టీపీసీసీ సభ్యురాలు ఒగ్గెల పూజ ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన హాత్‌సే హాత్ జోడో యాత్రపై వలస గొత్తికోయ గ్రామం తోగ్గూడెంలో గురువారం ఆమె ప్రచారం చేశారు. సున్నం నాగేశ్, రమాదేవి. కుర్సం తిరుపతిరావు, మడివి వెంకటేష్, ఎలకం లక్ష్మణ్, కారం ముత్యాలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అశ్వాపురం: మండల పరిధిలోని సీతారాంపురం గ్రామ పంచాయతీలో గురువారం మండల ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ జి.అరుణ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ చాప ఉమాదేవి ప్రారంభించారు. 191 మంది రోగులకు వైద్యాధికారి డాక్టర్ అరుణ పరీక్షలు చేసి ఆయుర్వేద మందులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి వేణుప్రియ, ఉపసర్పంచ్ కందుల వెంకటేశ్వర్లు, ఏఎస్ఎం సుజాత, శ్రీనివాస్, రాధిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు


దుమ్ముగూడెం: విద్యుత్‌శాఖ ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను దుమ్ముగూడెం మండల వ్యాప్తంగా ఉన్న రైతులు గురువారం ముట్టడించారు. విద్యుత్ సమస్యలపై ఆ శాఖ ఏడీ వేణుకి వినతి పత్రం అందజేశారు. అనంతరం రైతులు సమస్యలను వివరిస్తూ.. దుమ్ముగూడెం మండల వ్యాప్తంగా త్రీఫేస్ కరెంటు సరిగా ఇవ్వడం లేదని, ఇచ్చినా నిర్దిష్టమైన సమయం లేకుండా ఇస్తున్నారని అన్నారు. దీనివల్ల కరెంటు ఎప్పుడొస్తుందో తెలియడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడీ వేణు స్పందిస్తూ.. ఇప్పుడు ఇస్తున్న త్రీఫేస్ కరెంటును ఇకనుండి నిర్దిష్టమైన సమయం ప్రకారం అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. దీంతో రైతులు సబ్‌స్టేషన్ ముట్టడిని విరమించారు. కార్యక్రమంలో రైతులు యలమంచి శ్రీను, యలమంచి వంశీ, ముల్లపూడి చిన్న రావు, రావులపల్లి పృథ్వీ, కొడాలి లోకేష్, క్రాప వెంకటేశ్వరావు, మాగంటి వెంకన్న, కొల్లి శ్రీను, అనిల్, సురేంద్ర, ఆలా రమేష్ , నర్సింహాచారి, క్రాప కిషోర్, బొల్లోజు వేణు, తాటిపూడి రమేష్. కారం పుల్లయ్య, నోముల రామిరెడ్డి, చప్పిడి రామచంద్రరావు, వీరమాచినేని సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: విద్యుత్ సరఫరాలో అవాంతరాలు నివారించాలని, 24 గంటలపాటు నిరంతరాయంగా కరెంట్ సౌకర్యం కల్పించాలని జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక రైతులతో కలసి మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను ముట్టడించి, నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీనర్సింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. వ్యవసాయ రంగానికి బాసటగా ఉంటామని హామీలిచ్చి గద్దెనెక్కిన కేసీఆర్ వాటి అములులో తీవ్రనిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఎండి.అంజుం, పాలకుర్తి సుమిత్, ఖాదర్‌బాబా, బూరుగుపల్లి పద్మశ్రీ, రామిశెట్టి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మండలంలోని శ్రీశ్రీనగర్ ప్రాంతానికి చెందిన గుండగాని సువర్ణ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సతీమణి రేగా సుధారాణి గురువారం వారి నివాసానికి వెళ్లి సువర్ణను పరామర్శించి ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10వేలను బాధితురాలికి ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని తిర్లాపురం గ్రామానికి చెందిన బొగ్గం మంగయ్య ఇటీవల మరణించారు. ఆయన దశదినకర్మలను గురువారం కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆదేశాల మేరకు మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు ఈ కార్యక్రమానికి హాజరై మృతుని చిత్రపటం వద్ద పూలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని జెడ్పీటీసీ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముత్యంబాబు, పెండ్యాల నాగేశ్వరరావు, బొలిశెట్టి నవీన్, తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని సీతానగరం గ్రామంలో ఇటీవల జరిగిన షార్ట్ సర్క్యూట్ వల్ల శ్యామల వెంకటేష్ ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన విషయాన్ని తెలుకున్న కొర్స వెంకటేశ్వరరావు రూ.5వేలు ఆర్థికసాయం గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి తనవంతుగా ఇంటి స్థలం సీతానగరం పంచాయతీ పరిధిలో కొని ఇవ్వడానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పర్ణశాల సర్పంచ్ తెల్లం వరలక్ష్మి, ఏటీపీ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ సవలం వీరాస్వామి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు సోయం కామరాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు తెల్లం నరసింహారావు, డివిజన్ అధ్యక్షుడు సోంది మల్లురు, పాడియం వెంకటరమణ, నాయకులు కోరం మురళి, కొమరం నరేష్, వాగే వెంకటేష్, తుష్టి కామేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి శక్తి కేంద్రాల్లో సమావేశాలు

భద్రాచలంఅర్బన్: నియోజకవర్గంలోని శక్తి కేంద్రాల్లో శుక్రవారం నుంచి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ పాలక్ యాపా సీతయ్య తెలిపారు. పట్టణంలో గురువారం ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం నుంచి 25వ తేదీ వరకు నియోజకవర్గంలో ఃహడా 59 శక్తి కేంద్రాల్లో కార్నర్ సభలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఇవ్వనున్న కేంద్ర ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కుంజ సత్యవతి, నాయకులు చెరుకూరి సతీష్, త్రినాథరావు, క్రాంతిబాబు, రామ్మోహన్‌రావు, శేఖర్, కన్నయ్య, కిషోర్, కార్యదర్శి, చెలుపోయిన వెంకన్న, సుదర్శన్, జయరాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘రేగా గెలుపు ఖాయం’


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అశ్వాపురం: వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే రేగా కాంతారావు గెలుపు ఖాయమని బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మట్టపల్లి సాగర్‌యాదవ్, మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ మండల యువజన విభాగం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రేగా కాంతారావు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు అవాకులు, చేవాకులు మాట్లాడుతున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే రేగా చేస్తున్న అభివృద్ధిని యువజన నాయకులు ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఇంటింటికి వాల్ పోస్టర్ కార్యక్రమంలో యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడి అమరేందర్, మర్రి మల్లారెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, గొందిగూడెం ఎంపీటీసీ కొమరం చిట్టెమ్మ, నియోజకవర్గ యువజన ఉపాధ్యక్షుడు లంకెల రమేష్, ప్రధాన కార్యదర్శి మంగళగిరి రామకృష్ణ, మైనార్టీ సెల్, బీసీ సెల్ అధ్యక్షుడు నయీం, మామిళ్ల కనీష్, యువజన నాయకులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం



అన్నపురెడ్డిపల్లి-సత్తుపల్లి ప్రధాన రహదారిలో వెంకటాపురం గ్రామ శివారులోని రాళ్ల వాగు చెరువు అలుగు వద్ద ఉన్న చప్టా వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ రహదారిలో పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చప్టాకు ఒక పక్క భారీగా గుంత ఏర్పడి ఉంది. చప్టా వద్ద ఏర్పటు చేసిన రేడియం స్టిక్కరింగ్ పైపులు పూర్తిగా తొలగిపోయాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చప్టా ప్రాంతంలో ప్రమాదం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- అన్నపురెడ్డిపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: లక్ష్మానాయక్, ఆర్అండ్‌బీ ఏఈ
ఫోన్ నంబర్: 9866309579